క్లుప్తంగా

పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి

చింతూరు: మండలంలోని మల్లెతోట ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘం జిల్లా నాయకుడు సీసం సురేష్ డిమాండ్ చేశారు. గిరిజన సంఘం బృందం ఆశ్రమ పాఠశాలను శుక్రవారం సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, నీటి సమస్య తీవ్రంగా ఉన్నట్లు విద్యార్థులు తెలిపారని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ఆశ్రమ పాఠశాలలో ప్రాథమిక పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఆయన కోరారు. నాయకులు సుబ్బారావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు చర్యలు


ఎంపీపీ, ఉషారాణి

అరకులోయ రూరల్: మలేరియా నిర్మూలనకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి కోరారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు విజృంభించకుండా అధికారులు గ్రామాల్లో విస్తృతంగా దోమల నివారణ మందు స్ప్రేయింగ్ పనులు చేపట్టాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోయి ఈగలు, దోమలు పెరిగి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. మండలంలోని అన్ని పంచాయతీ కేంద్రాలతో పాటు గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించేలా ప్రజలకు చైతన్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

రేపు కంటి వైద్య శిబిరం

అరకులోయ టౌన్: మండలంలోని భరభగుడ గ్రామంలో సీబీఎం చర్చి సమీపంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ మండల శాఖ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖలోని శంకర్‌ఫౌండేషన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు శిబిరం జరుగుతుందని సంఘం మేనేజర్ ఎం.చంద్రశేఖర్, అధ్యక్షుడు వి.బాబూరావు, గౌరవ అధ్యక్షుడు బి.ఆనందరావు పేర్కొన్నారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారు ఆరోగ్య శ్రీ కార్డు, ఆధార్ కార్డు, తెల్ల రేషన్‌కార్డు తీసుకువస్తే ఆ రోజు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి విశాఖకు తరలిస్తామన్నారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

22 నుంచి రెండో విడత కౌన్సెలింగ్


విజయభారతి, ప్రిన్సిపాల్

చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించి రెండో విడత కౌన్సిలింగ్‌ను ఈ నెల 22 నుంచి నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ భారతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకూ రిజిస్ట్రేషన్లు, ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు కోర్సు ల ఎంపిక, 26వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని తెలిపారు. 29న సీట్ల కేటాయింపు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 3వ తేదీలోగా కళాశాలలో చేరాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ విజయ భారతి తెలిపారు.

సుర్తిపల్లికి రోడ్డు సదుపాయం కల్పించండి


సుర్తిపల్లి గ్రామానికి రోడ్డు నిర్మించాలని కోరుతున్న స్థానికులు

జి.మాడుగుల: మండలంలో కోరాపల్లి పంచాయతీ సుర్తిపల్లి గ్రామానికి కనీసం రోడ్డు సదుపాయం లేకపోవడంతో అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కోంటున్నామని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో 50 కుటుంబాలు ఉన్నాయని, ప్రభుత్వానికి, అధికారులకు పలు మార్లు వినతులు అందించినా కనీసం పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో 108 సేవలు అందే పరిస్థితి లేదని వారు చెబుతున్నారు. గ్రామంలో గర్భిణులు, రోగులకు వైద్య సేవల నిమిత్తం డోలీమోతతో అష్టకష్టాలతో కిలోమీటర్ల దూరంలో ఉన్న రోడ్డు ఉన్న చోటుకి తరలించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సుర్తిపల్లి గ్రామానికి పక్కారోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.



పై చిత్రంలో కనిపిస్తున్న మురుగునీటి గుంత వెనుక ఉన్న భవనం చింతూరులోని నర్సింహాపురం గిరిజన బాలికల పాఠశాలకు చెందిన వసతిగృహం. ఇందులో సుమారు 430 మంది విద్యార్థులు నివాసముంటున్నారు. వసతిగృహం పక్కనే ఉన్న గోడకు ఆనుకుని ఆకుపచ్చ రంగులో మురుగునీరు నిలువ ఉంది. రోజుల తరబడి మురునీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది వసతిగృహ బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. తీవ్ర దుర్గంధం నానా అవస్థలు పడుతున్నారు.



పై చిత్రంలో మురుగునీటి గుంత వెనుక ఉన్న భవనాలు ఆశ్రమ పాఠశాలకు చెందిన సిబ్బంది నివాస గృహాలు. ఆయా గృహాలను ఆనుకొని ఉన్న గోడ పక్కనే రోజుల తరబడి మురుగునీరు నిలిచి ఉంది. దుర్గంధంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. దోమలతో ఇబ్బందులు పడుతున్నామని, రోగాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పై చిత్రంలో ఎడమ వైపున కనిపిస్తోంది చింతూరు బస్టాండు కాగా.. కుడివైపున కనిపిస్తోంది గిరిజన బాలికల వసతి గృహానికి చెందిన వంటషెడ్డు, డైనింగ్‌హాలు. ఇక్కడ మురుగునీరు భారీస్థాయిలో నిలిచి ఉండడంతో బస్టాండుకు వచ్చే ప్రయాణికులు, వసతిగృహం విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పాటు ఈ మార్గంలో తరచూ దుమ్ము, ధూళితో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు.

మురుగు కూపాలు

- కొరవడిన పారిశుధ్యం
- అధ్వానంగా కాలువలు
- పేరుకుపోయిన పూడిక
- దోమలు, కీటకాలతో ఇక్కట్లు
- దుర్గంధంతో అవస్థలు
- పట్టించుకోని అధికారులు


బాలికల ఎస్ఎం హాస్టల్, ఏటీడబ్ల్యూవో కార్యాలయం వద్ద మురుగునీరు

చింతూరు: మండలంలో పారిశుధ్యం కొరవడింది. ఎక్కడ చూసినా చెత్తా,చెదారాలు పేరుకుపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలతో కాలువల్లో పూడిక పెరిగింది. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. చినుకు పడినా పరిస్థితి మరింత దారుణంగా ఉంది. తీవ్ర దుర్గందంతో స్థానికులు సతమతమవుతున్నారు. ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు, కీటకాలు వ్యాప్తి చెందుతున్నాయని చెబుతున్నారు. రోగాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి వీధిలో ఇదే పరిస్థితి ఉందని ఆవేదన చెందుతున్నారు. ఆయా ప్రాంతాల మీదుగా అధికారులు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

మురుగునీరుకు దారిలేక

మండల కేంద్రం చింతూరులోని ఆశ్రమ పాఠశాల, వసతిగృహం, బస్టాండు పక్కనే ఉన్న మురుగునీరు వెళ్లేందుకు దారి లేకుండా నిల్వ ఉంది. తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీనిపై ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కృష్ణకుమారిని వివరణ కోరగా గతంలో మురుగునీరు తొలగించాలని చింతూరు ఎంపీడీవో కార్యాలయానికి లేఖ రాసినట్టు తెలిపారు. తాము పడుతున్న ఇబ్బందులను చూసి తమ తల్లిదండ్రులు ఈ విషయంపై ఐటీడీఏలో కూడా ఫిర్యాదు చేశారని విద్యార్థినులు చెబుతున్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

మండల కేంద్రంలోని గిరిజన బాలికల సెల్ఫ్ మేనేజ్‌మెంట్ వసతిగృహం, ఏటీడబ్ల్యూవో కార్యాలయం పక్కన, పక్కనే ఉన్నాయి. వసతిగృహంలో డిగ్రీ, ఇంటర్‌కు చెందిన సుమారు 200 మంది విద్యార్థినులు ఉంటున్నారు. ఆయా భవనాలను ఇరువైపులా ప్రహరీల వద్ద మురుగునీటి గుంత ఉంది. మురుగు నీటి నిల్వ దుర్గంధంతో వసతిగృహం విద్యార్థులు, ఏటీడబ్ల్యూవో కార్యాలయ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సదురు కార్యాలయం అధికారులు ప్రతిరోజు మురుగు కాలువల పక్క నుంచే రాకపోకలు సాగిస్తుండడం విశేషం.

బొత్స ఏకగ్రీవ ఎన్నికపై హర్షం

దుంబ్రిగుడ: ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో మండల జెడ్పీటీసీ సభ్యురాలు చటారి జానకమ్మా, ఎంపీపీ బాకా ఈశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చిక్కుడు మల్లేశ్వరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో పూర్తిగా వైఎస్సార్‌సీపీకి పట్టు ఉండడంతో పాటు మద్దతుదారులు బొత్స సత్యనారాయణ వైపు ఉండడంతో కూటమీ ప్రభుత్వం పోటీ చేయలేకపోయిందన్నారు. దీంతో బొత్స ఏకగ్రీవంగా ఎన్నిక కావడం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి శుభపరిమాణంగా చెప్పవచ్చన్నారు. వైస్ ఎంపీపీలు శెట్టి ఆనంద్, లలిత, ఎంపీటీసీ సభ్యులు విజయ, వరహాలమ్మ, జెమ్మ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

19న అమ్మవారి విగ్రహ ప్రతిష్ట


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న దుర్గమ్మతల్లి ఆలయం

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని స్థానిక సంతబయలు సమీపంలో నిర్మించిన శ్రీ దుర్గమ్మ ఆలయం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. ఈ నెల 18న ఆలయం వద్ద గణపతిపూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, అంకురార్పణ, వాస్తు పూజ, నవ కలశారాధన మహాశాంతి హోమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు, సర్పంచ్ సీసా సుభాష్‌చంద్ర, ప్రధాన కార్యదర్శి ఎరుకుల మధుసూదన్, సమన్వయకర్త, కన్వీనర్ చిట్టపులి ప్రసాద్‌రావుపడాల్, కార్యదర్శి కూడ మత్స్యలింగం తదితరులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19వ తేదీన దుర్గమ్మ ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించి, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహాశాంతి హోమం, పూర్ణాహుతి, అమ్మవారికి ప్రథమ పూజ, అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం ఆలయ ప్రాంగణం నిర్వహించనున్నట్టు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి కార్యక్రమాల్లో పాల్గొవాలని కోరారు.

రెగ్యులర్ టీచర్‌ను నియమించాలని వినతి


పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం అందజేస్తున్న మండిభ గ్రామస్తులు

పాడేరు : జి.మాడుగుల మండలం బొయితిలి పంచాయతీ మండిభ గ్రామంలో ఉన్న మండల గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో రెగ్యులర్ టీచర్‌ను నియమించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పాడేరులో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో 50 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని రెగ్యులర్ ఉపాధ్యాయుడు లేకపోవడంతో చిన్నారుల విద్యాభ్యాసం ప్రశ్నార్థకం మారిందని తెలిపారు.

ఈ విషయంపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని వారు కోరారు. దీనిపై ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు స్పందించి సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రెగ్యులర్ ఉపాధ్యా యుడుని నియమించేలా చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతపల్లి: మండలంలో లోతుగడ్డ జంక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎ.వి.ఎస్ అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోతుగడ్డ జంక్షన్ 11 కె.వి.ఫీడర్ లైన్ మరమ్మతు పనుల్లో భాగంగా లోతుగడ్డ జంక్షన్, చిన్నగడ్డ, వంగసార ప్రాంతాల్లో ఈ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

103 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి కిరణ్‌కుమార్

పెదబయలు: మండలంలోని ఇంజరి పంచాయతీ గబుడుపుట్టు గ్రామంలో గోమంగి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో 103 మందికి వైద్య సేవలందించినట్టు చెప్పారు. శిబిరానికి వచ్చిన 28 మందికి వైరల్ జ్వరాలున్నట్టు గుర్తించి రక్త పరీక్షలు చేశామని, 16 మందికి చర్మవ్యాధులు, నలుగురికి రక్తహీనత సమస్య, ఒకరికి ఫిట్స్ తదితర సమస్యలున్నట్టు గుర్తించామని వారికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశామన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని అవగాహన కల్పించారు. ఎవరికైనా ఆరోగ్యం బాగా లేకపోతే వెంటనే సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి వైద్యం పొందాలని సూచించారు. హెచ్‌వీ జననీ, ఏఎన్‌ఎంలు కామేశ్వరి, రత్నం,హెల్త్ అసిస్టెంట్ సూరిబాబు, సిబ్బంది వెంకటేశ్వర్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ.. నమోస్తుతే


ప్రత్యేకాలంకరణలో అమ్మవారి చిత్రపటం, భక్తులు సమర్పించిన నైవేద్యం

- భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు
- భక్తులతో కళకళలాడిన ఆలయాలు


పూజలు చేస్తున్న భక్తులు



ముంచంగిపుట్టు, జి.మాడుగులలోని పూజల్లో పాల్గొన్న భక్తులు



ఇళ్లల్లో పూజలు చేస్తున్న భక్తులు


పవనగిరి క్షేత్రంలోని వనదుర్గ అమ్మవారు

ముంచంగిపుట్టు/దుంబ్రిగుడ/అనంతగిరి(అరకులోయ రూరల్)/చింతపల్లి/గూడెం కొత్తవీధి/జి.మాడుగుల/కొయ్యూరు/అడ్డతీగల/వై.రామవరం/రాజవొమ్మంగి: శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామాల్లో మహిళలంతా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. ఇళ్లకు మామిడి తోరణాలు కట్టి, కొత్త దుస్తులు ధరించి, ఆర్థిక స్తోమతను బట్టి అమ్మవారి బంగారు ప్రతిమలు, బంగారు ఆభరణాలు అలంకరించి, ఉన్న ధనాన్ని అమ్మవారి సన్నిధిలో ఉంచి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వరలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి ధనలక్ష్మి, విజయలక్ష్మి, సిరులు కురిపించే శ్రావణలక్ష్మికి స్వాగతం పలుకుతూ సకల సౌభాగ్యములు కలిపించాలని సుఖ సంతొషాలతో ఉండే విధంగా చల్లగా చూడమ్మా..అంటూ ప్రార్థించారు. కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. గృహల్లో వరలక్ష్మీ వ్రతం చేసేందుకు కలశంతో అమ్మవారి ఫోటోలు, ప్రతిమలు ఉంచి మండపాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఇంటికి ముత్తయిదువులను ఆహ్వానించి వాయినాలు అందజేశారు. పిండివంటలు, పంచామృతం, పండ్లు, ఫలహారాలతో వరలక్ష్మీ అమ్మవారిని పూజించి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. వేకువ జాము నుంచి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ముంచంగిపుట్టులోని సుజన కోట, జోలాపుట్టు, చెరువుపాకల గ్రామాల్లో ఉన్న గ్రామ దేవతల ఆలయాల వద్ద భక్తులు ధూప దీప నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. దుంబ్రిగుడ లో ఘనంగా శ్రావణమాసం రెండో శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జెడ్పీటీసీ చటారి జానకమ్మ ఇంట్లో నిర్వహించిన పూజలకు మహిళలు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొయ్యూరు దుర్గమ్మ తల్లి ఆలయానికి మహిళలు పోటెత్తారు. అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలోని వనదుర్గా అమ్మవారి ఆలయంలో దుర్గా మాత అమ్మవారి చెంతనే వర్రలక్ష్మీ అమ్మవారిని నెలకొల్పి విశేష పూజలు చేశారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య ఏర్పాట్లు పర్యవేక్షించగా, ఆయన సతీమణి విజయలక్ష్మీ పలువురు మహిళా భక్తులతో పూజలు నిర్వహించారు. వరలక్ష్మీ పూజ కథను వివరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ గావించారు.



కుటుంబసమేతంగా పూజలు చేస్తున్న భక్తులు

వైద్య సిబ్బంది సాహసం


తారాబు గ్రామస్తులకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది

- గెడ్డలు దాటి గ్రామాలకు వెళ్లి వైద్యసేవలు
- స్థానికుల హర్షం

పెదబయలు: మండలంలోని మారుమూల గ్రామాల్లో గెడ్డలు పొంగి ప్రవహిస్తున్న తప్పని పరిస్థితిలో గెడ్డలు దాటుకుంటూ వెళ్లి వైద్య సేవలందిస్తున్నారు.


మండలంలోని రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జామిగుడ విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలోని తారాబు, గుంజివాడ, చింతలవీధి, కెందుగుడ, గబ్బర్ల గ్రామాలకు వెళ్లాలంటే తప్పనిసరిగా గుంజివాడ గెడ్డ, తారాబు గెడ్డలు దాటాల్సిందే.. ఈ నేపథ్యంలో శుక్రవారం మండలం తారాబు గెడ్డను గుంజివాడ ఎంఎల్‌హెచ్‌పి మంజుల, ఏఎన్‌ఎం పుష్పకుమారి నడుము లోతు వరకు ప్రవహిస్తున్న తారాబు గెడ్డను గ్రామస్తుల సహాయంతో దాటుకుంటూ వెళ్లారు. అనంతరంలో గ్రామంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు గ్రామస్తులకు వైద్య సేవలందించారు. వర్షాకాలంలో గెడ్డలు దాటి వెళ్లడం తప్పనిసరి అని.. గెడ్డ దాటడం భయంగా ఉన్నప్పటికి ప్రజలకు సేవలందించడం ముఖ్యమని వైద్య సిబ్బంది చెప్పారు.

ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు


బాధ్యతలు స్వీకరిస్తున్న బాపన్నదొర →

ఎటపాక: మండల పరిషత్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తున్న కె.బాపన్నదొరకు ఎంపీడీఓగా అదనపు బాధ్యతలను అప్పగించారు. ఎన్నికల సమయంలో అధికారుల బదిలీల పక్రియలో ఎటపాక ఎంపీడీవోగా వచ్చిన మురళీకృష్ణను తన మండలం చింతలపూడికి తిరిగి బదిలీ చేశారు.ఆయన వెళ్లడంతో బాపన్నదొర ఎఫ్ఏసీగా శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు.

ప్రకృతి అందాలు కనువిందు


జి.మాడుగుల-పెలోచలి రోడ్డు మార్గంలో గొడుగుమామిడి గ్రామం వద్ద ప్రకృతి అందాలు కనువిందు చేశాయి. ఆకాశంలో మేఘాలు, ఆకుపచ్చని పంట పొలాలు రమణీయమంగా దర్శమిచ్చాయి. ప్రకృతి ప్రేమికులను ఈ దృశ్యాలు ఎంతోగానో ఆకట్టుకున్నాయి. - జి.మాడుగుల

పూలుగుడ పాఠశాలకు వితరణ


పాఠశాలలో మరుగుదొడ్లకు ఏర్పాటుచేసిన కొత్త తలుపులను ప్రారంభిస్తున్న సర్పంచ్ దేవగన్ తదితరులు

దుంబ్రిగుడ: మండలంలోని అరమ పంచాయతీ పూలుగుడ ఎంపీపీఎస్ పాఠశాలలో పాడైన మరుగుదొడ్ల మరమ్మతు పనులను అమెరికాలోని ఫ్లోరిడా ప్రాంతానికి చెందిన సత్యకళ మిత్ర బృందం వారి ప్రేమబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్, అరమ పంచాయతీ సర్పంచ్ కె.దేవగున్ మాట్లాడుతూ ప్రేమబంధు ఫౌండేషన్ పాఠశాలలో సుమారు రూ.60వేలతో మరుగుదొడ్ల మరమ్మతు పనుల్లో భాగంగా కొత్త తలుపులు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. దీంతో పాటు సుమారు రూ.10వేల విలువ చేసే వాటర్ ఫిల్టర్‌ను అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్‌కుమార్, ఎస్ఎంసీ చైర్మన్ బలరాం, సభ్యులు దొబులు, కోగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.